కూర్మాలను కాపాడుకుందామిలా..





అరుదైన ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణపై మత్స్యశాఖ దృష్టి సారించింది. అంతరించిపోతున్న వీటిని కాపాడుకునేందుకు చర్యలు చేపడుతోంది. అటవీ, మెరైన్ పోలీసులు, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పలు మత్స్యశాఖలు, వాటి అనుబంధ సంస్థలను భాగస్వామ్యం చేసి మూగజీవుల రక్షణకు నడుం బిగించింది. సంరక్షణ కేంద్రాల ఏర్పాటు, విస్తృత అవగాహన కార్యక్రమాలతో ముందుకు వెళ్తోంది.

మహారాణిపేట: సాగర తీరంలో ఒడ్డుకు వచ్చి మరణిస్తున్న ఆలివ్ రిడ్లే తాబేళ్లపై మత్స్యశాఖ దృష్టి సారించింది. వివిధ ప్రభుత్వశాఖల భాగస్వామ్యంతో వాటిని కాపాడేందుకు చర్యలు చేపడుతోంది.

వందల మైళ్ల దూరం ప్రయాణించి..

ఆలివ్ రిడ్లే తాబేళ్లు వాటి సంతతిని వృద్ధి చేసుకునేందుకు వందల మైళ్ల దూరం ప్రయాణించి విశాఖ తీరానికి వస్తుంటాయి. ఇక్కడ ఫిషింగ్ వలలకు చిక్కుకుని మరణిస్తుంటాయి. అలా మరణించిన తాబేళ్లు ఒడ్డుకు కొట్టుకు వస్తుంటాయి. దీనిపై మత్స్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. సముద్ర కాలుష్యం, తాబేళ్లు గుడ్లు పెట్టే ప్రాంతం లేదా సమీపంలో కంపెనీలు, ఇతర నిర్మాణాలు చేపట్టడం, తీరంలో పెట్టిన గుడ్లు కుక్కలు, ఇతర జంతువులు తినడం, తాబేళ్ల షెల్స్ లేదా మాంసం వినియోగించడం వల్ల వాటి సంఖ్య క్రమేణా తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో మత్స్యశాఖ అధికారులు తాబేళ్ల జాతిని పరిరక్షించడం కోసం పలు చర్యలు చేపట్టారు.

- ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణకు మత్స్యశాఖ చర్యలు
- పలు శాఖల భాగస్వామ్యంతో ముందుకు..
- విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

ఆలివ్ రిడ్లే జాతికి చెందిన తాబేళ్లు పసిఫిక్, అట్లాంటిక్, ఇండియన్ సముద్ర జలాల్లో నివసిస్తాయి. వీటి ఉపరితల కవచం (షెల్) ఆలివ్ గ్రీన్ **రంగులో ఉండడం** వల్ల వీటిని 'ఆలివ్ రిడ్లే' తాబేళ్లుగా పిలుస్తారు.

ఆలివ్ రిడ్లే.. పేరు ఇలా..

వీటి శాస్త్రీయ నామం లెపిడోకేలిస్ ఆలివేషియా. ఇవి 22 అడుగుల పొడవు ఉంటాయి. 35–45 కేజీల వరకు బరువుంటాయి. సముద్ర ఉపరితలం నుంచి సుమారు 150 మీటర్ల లోతు వరకు సంచరిస్తాయి. ఇవి ఆల్గే రకపు నాచు, క్రస్టేషియన్స్ నత్తలు, జెల్లీ ఫిష్, చేపలను ఆహారంగా తింటాయి. ఆలివ్ రిడ్లే తాబేళ్లకు ఒడిశా తీరంలో గల గహిర్మాత ప్రాంతం ప్రసిద్ధి. ఇవి ఎక్కువగా ఒడిశాలో గల దేవి, రుషికుల్యా, రూకరీ తీరంలో గుడ్లు పెడతాయి. సాధారణంగా ఆంధ్రప్రదేశ్ తూర్పు తీర ప్రాంతంలో నవంబరు నుంచి జనవరి వరకు గుంపులుగా గుడ్లు పెట్టడానికి ఆడ తాబేళ్లు తీరానికి వస్తాయి. ఒక్కొక్క తాబేలు 100–110 వరకు గుడ్లు పెడుతుంది. వీటిని 50–60 రోజుల్లో పొదుగుతుంది. ఈ పిల్లలు ఈదుకుంటూ సముద్రంలోకి చేరుకుంటాయి.

సంరక్షణ చర్యలు ఇలా..

ఒడిశా తీరంలో గహిర్మాత, రుషికుల్యా తదితర ప్రాంతాల్లో తాబేళ్లు గుడ్లు పెట్టే కాలంలో సముద్రంలో చేపల వేట నిషేధించడం గత కొన్ని సంవత్సరాలుగా వస్తున్న సంప్రదాయం. తాబేళ్లు తీరానికి గుడ్లు పెట్టడానికి వచ్చే ప్రాంతంలో వాటికి నష్టం కలిగించే వేట పద్ధతులు విడనాడాలి. తెగిపోయిన తాళ్లు, వలలు, ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రంలో వేయకూడదు. ప్రభుత్వం తాబేళ్ల రక్షణ కోసం ప్రకటించిన 'నో ఫిషింగ్ జోన్'లో చేపలు వేటాడరాదు. వన్యప్రాంతాల సంరక్షణ చట్టం 1972 ప్రకారం తాబేళ్లను పట్టుకోవడం, వాటి శరీర భాగాల వినియోగం, రవాణా నిషేధం. కనుక తాబేళ్ల సంరక్షణ దృష్ట్యా మత్స్యకారులు ట్రాల్ వలలో తాబేళ్లు తప్పించుకునేందుకు ఉపకరించే పరికరం (టీఈడీ) అమర్చి వేట సాగించాలి. ప్రమాదవశాత్తు వలలకు చిక్కుకున్న తాబేళ్లను బ్రతికున్నప్పుడే వేరు చేసి సురక్షితంగా సముద్రంలో విడిచిపెట్టాలి. ఆ తర్వాత వేట సాగించాలని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్నాం



తాబేళ్ల రక్షణకు మత్స్యకారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ఇటీవల ఫిషింగ్ హార్బర్‌లో ఏపీ మర పడవల సంఘం కార్యాలయంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపెడా, నెట్‌ఫిష్ శాఖలకు చెందిన శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు. తాబేళ్ల రక్షణ కోసం పలు విషయాలను వివరించాం.

– పి.లక్ష్మణరావు, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ



తీరానికి కొట్టుకొచ్చిన చనిపోయిన తాబేళ్లు (ఫైల్)

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో షబే ఖదర్



విద్యుత్ దీపాలంకరణలో బుల్లయ్య కాలేజీ వద్ద గల యాసీన్ మసీదు

జగదాంబ: షబే ఖదర్ వేడుకను ముస్లింలు గురువారం రాత్రి భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో తెల్లవారుజాము వరకు ప్రత్యేక నమాజ్, ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసంలో 26వ రోజున రాత్రి షబే ఖదర్ వేడుక జరుపుకుంటారు. ఈ సందర్భంగా మౌల్వీలు షబే ఖదర్ వేడుక విశిష్టతను వివరించారు. రంజాన్ మాసంలోనే షబే ఖదర్ రోజున పవిత్ర ఖురాన్ అవతరించినట్లు గ్రంథంలో ఉన్నట్టు తెలిపారు. తెల్లవారు వరకు జాగరణ అనంతరం ఉపవాస దీక్ష చేశారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఉచిత శాస్త్రీయ సంగీత శిక్షణ తరగతులు

దాబాగార్డెన్స్: దాబాగార్డెన్స్‌లో గల బీవీఎల్ శాస్త్రి సంగీత సమితి కమిటీ ఆధ్వర్యంలో ఏడాది పాటు ఉచితంగా సంగీత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు సంస్థ కార్యదర్శి పి.జగన్మోహన్‌రావు పేర్కొన్నారు. ఐదేళ్ల నుంచి 50 ఏళ్లలోపు విద్యార్థులు, స్త్రీ, పురుషులు కుల మతాలకతీతంగా శిక్షణలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. నగరానికి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు ఆకొండి వెంకట్రావు శాస్త్రీయ సంగీతంపై శిక్షణ అందజేయనున్నారని తెలిపారు. ఆసక్తి గల వారు 6302661211, 8309220060 నంబర్లలో సంప్రదించవచ్చు. ఏప్రిల్ 6న ఉదయం 6 నుంచి 8 గంటలలోపు రామ్‌నగర్ మెయిన్‌రోడ్డులో గల రాఘవేంద్రస్వామి ఆలయంలో దరఖాస్తులను పొందవచ్చని పేర్కొన్నారు. శాస్త్రీయ సంగీతం, అన్నమాచార్య సంకీర్తనలు, పురందరదాసు సంకీర్తనలు, వేణుగానంపై ఉంటుందన్నారు.

సన్నాయి విద్వాన్ కొప్పనూరు మృతి



కొప్పనూరు రామకృష్ణ (ఫైల్)

దాబాగార్డెన్స్: ప్రముఖ సన్నాయి విద్వాన్ దో మడా చిట్టి అబ్బాయి శిష్యుడు, కనకమహాలక్ష్మి దేవస్థానంలో 35 ఏళ్లుగా సన్నాయి విద్వాన్‌గా విధులు నిర్వర్తించి 2010 లో పదవీ విరమణ పొందిన కొప్పనూరు రామకృష్ణ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. రామకృష్ణ మృతికి కనకమహాలక్ష్మి దేవస్థానం ఉద్యోగులు, సంఘ సభ్యులు, అధికారులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై ప్రత్యేక ఆఫర్లు

మహారాణిపేట: ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని ఆప్కో చేనేత వస్త్రాలపై ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నారు. కొత్త వస్త్రాలపై 30 శాతం డిస్కౌంట్, ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 45 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్టు ఆప్కో విజయనగరం మండల వాణిజ్య అధికారి బి.హరి ప్రసాదరావు తెలిపారు. విశాఖ జిల్లాలో అన్ని ఆప్కో విక్రయశాలల్లో ఈ ఆఫర్లు ఉంటాయన్నారు.

'లులూ'కు భూ కేటాయింపును ఉపసంహరించుకోవాలి'

అల్లిపురం: కూటమి ప్రభుత్వం హార్బర్ పార్క్ భూములను తిరిగి లులూ సంస్థకు కట్టబెట్టాలని నిర్ణయం తీసుకోవడాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ విశాఖ జిల్లా కమిటీ కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను కారుచౌకగా కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇది విశాఖ అభివృద్ధికి దోహదపడకపోగా తీవ్ర హాని చేసేదిగా భావిస్తున్నామని, ఆ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా లులూ సంస్థకు భూములు కేటాయిస్తోందని తెలిపారు. అంతేగాక ఈ సంస్థకు రాష్ట్రప్రభుత్వం కల్పిస్తున్న రాయితీల వల్ల ప్రభుత్వం ప్రతి ఏడాది వందల కోట్లు ఆదాయం నష్టపోతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేస్తోందన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు గురువారం విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

50 శాతం వడ్డీ మాఫీని ఉపయోగించుకోండి

జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు



రూ. 10 వేలు చెక్‌ను అందుకుంటున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: పన్నుబకాయిదారులు 50 శాతం వడ్డీ మాఫీని ఉపయోగించుకోలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2025 మార్చి నెలాఖరునాటికి ప్రభుత్వం 50 శాతం వడ్డీ మాఫీ చేస్తూ ప్రజలకు అవకాశం కల్పించిందన్నారు. దీనిని ఇంటి, ఖాళీస్థలాలు, వాణిజ్య సముదాయాలు, నీటి పన్నుదారులు ఉపయోగించుకుని త్వరితగతిన పన్నులు చెల్లించాలన్నారు. ఉగాది, రంజాన్ పండగల రోజుల్లో కూడా జోనల్ కార్యాలయంలో పన్నులు చెల్లించేందుకు సౌకర్యం సెంటర్ తెరిచే ఉంటుందన్నారు. గురువారం ఒక్క రోజే జీవీఎంసీకి రూ.కోటి ఆదాయం వచ్చిందన్నారు.

నీటి కుళాయిలు కనెక్షన్‌లు కట్

ప్రజలు పన్నులు చెల్లించకపోతే ముందుగా నీటి కుళాయిలు కట్ చేయడం జరుగుతుందన్నారు. తరువాత నోటీసులు జారీ చేసి సంబంధిత యాజమానులుఆస్తులు జప్తు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే జోనల్ స్థాయిలో ఓ బృందం నీటి కుళాయిలు కట్ చేస్తుంటే మరో రెవెన్యూ అధికారుల బృందం ఆస్తులు జప్తు చేస్తుందన్నారు.

ఐక్యతతోనే పెన్షనర్ల సమస్యలకు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

తాటిచెట్లపాలెం: పెన్షనర్లంతా ఐక్యతతో ఉంటే సమస్యల సాధన సులభమవుతుందని ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్. పట్నాయక్ అన్నారు. రైల్వేన్యూ కాలనీ సమీపంలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో గురువారం జరిగిన పెన్షనర్ల అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించుకోవాలంటే అందరూ ఐక్యంగా సాగాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుప్పిలి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ఏడాది నవంబరులో కేరళలోని కొచ్చిన్‌లో జాతీయ సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పెన్షన్‌దారుల సభ్యత్వం 1500కు చేరుకుందని, ఆలిండియాలో లక్షకు చేరువలో ఉందన్నారు. మనలో మాణిక్యాలు పేరిట వివిధ రంగాల్లో సేవలందించిన పలువురు పెన్షన్‌దారులను సత్కరించారు. అవార్డులు అందుకున్న వారిలో రామశర్మ(కార్టూన్ రంగం), టి రాజేశ్వర్(అంతర్జాతీయ పర్యాటకం), కేవీడీ స్వామి(సీజీహెచ్‌ఎస్)లు ఉన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి కె.సోమసుందరరావు, అడ్వైజరీ శ్రీమన్నారాయణ, కోశాధికారి పిన్నింటి బాబూరావు, సీనియర్ నేత శర్మ, ఇతర పింఛన్‌దారులు పాల్గొన్నారు.

'వీధి విక్రయదారులపై దాడులు ఆపాలి'

- వీతల మూర్తి యాదవ్‌పై చర్యలు తీసుకోవాలి
- తోపుడు బండ్లు, చిల్లరవర్తకుల కార్మిక సంఘం డిమాండ్

అల్లిపురం: తోపుడు బండ్లు, చిల్లర వర్తకులు, పేదలపై దాడులను తక్షణమే ఆపాలని తోపుడు బండ్లు, చిల్లరవర్తకుల కార్మిక సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం డిమాండ్ చేశారు. జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ లాంటి వారి వేధింపులతో విశాఖ నగరంలో తోపుడు బండ్ల కార్మికులు, వీధి విక్రేతలు భయం భయంగా గడుపుతున్నారన్నారు. జగదాంబలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించదు, రోడ్డు పక్కన బతుకుదామంటే దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో పక్క జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పిఠాపురం కాలనీలో, వారానికి 2 గంటలు వ్యాపారం చేసుకునే సంత వ్యాపారులను తొలగించాలని తప్పుడు సమాచారం అందించి హైకోర్టు నుంచి ఆర్డర్ తీసుకొచ్చారని ఆరోపించారు. 'తన జీవితం పేదవారి కోసమని, పేదల మంచికోసం పోరాడేందుకే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తమ పార్టీకి చెందిన పీతల మూర్తియాదవ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తక్షణమే వీధి విక్రయదారులపై దాడులు ఆపాలని, వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని, గుర్తింపుకార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. తోపుడు బండ్లు వర్తకులకు ఉపాధి, రక్షణ కల్పించాలని, లేకుంటే నగరవ్యాప్తంగా ఉన్న తోపుడు బండ్ల పేదలను కదిలించి, వారి ఉపాధికి రక్షణ కోసం జీవీఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

'ఆ ఉత్తర్వులతో ఔట్‌సోర్సింగ్ కార్మికులకు అన్యాయం'

అల్లిపురం: మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచడం సాధ్యం కాదని, గ్రాట్యుటీ కూడా వర్తించదంటూ ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.ఆనందరావు ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులు కాదని, వారికి ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే రిటైర్మెంట్ నిబంధనలు వర్తించవంటూ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ బుధవారం జారీ చేసిన సర్క్యులర్ వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

పోక్సో చట్టం పై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ అనురాగ్ కొమ్మాది



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

కంచరపాలెం: మైనర్లు, తల్లిదండ్రులు టీచర్లు పోక్సో చట్టంపై అవగాహన కల్గిండాలని ఏడో అడిషనల్ మేజిస్ట్రేట్ అనురాగ్ కొమ్మాది తెలిపారు. ఈ మేరకు కంచరపాలెం పరిధి జీవీఎంసీ రామ్మూర్తి పంతులుపేట ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి అనురాగ్ మాట్లాడుతూ నూతన చట్టాలపై ముఖ్యంగా పోక్సో వంటి వాటిపై బాలబాలికలు తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. తెలిసీ తెలియని వయసులో ప్రేమ, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడుతూ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, అందుకు గల కారణాలను న్యాయమూర్తి వివరించారు. ఎటువంటి న్యాయ సలహాలకైనా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ఆరీల్పేట యూపీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారిణి మట్టా శశిప్రియాంక , పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, కంచరపాలెం సబ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఎం.రజిని, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, సోషల్ వర్కర్లు సురేఖ, శారదాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిరుల తల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.23 లక్షలు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో శిరీష

సీతమ్మధార: నగరంలోని ఆశీలమెట్టలో ఉన్న శ్రీ సంపత్ వినాయగర్ దేవస్థానం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 35 రోజులకుగాను 23 లక్షల 33 వేల 349 రూపాయలు వచ్చినట్లు దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.శిరీష తెలిపారు. నగదుతోపాటు వెండి 456.600 గ్రాములు, 161 యూఎస్ డాలర్లు, 20 ఇంగ్లండ్ పౌండ్లు, 10 యూఏఈ దిర్హామ్స్, రూ.111 చెక్ రూపంలో వచ్చాయన్నారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ చోళన్‌తో కలిసి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారుగా ఎం.శ్రీధర్ వచ్చారు. లెక్కింపులో శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాలయ సిబ్బంది ఎ.గోవిందరెడ్డి, ఇ.ప్రసాద్, భక్తులు బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

పోలమాంబ దేవస్థాన హుండీ ఆదాయం రూ.6.81 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

టీచర్‌రోడ్డు: పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం గురువారం ఈవో గాయత్రి పర్యవేక్షణలో నిర్వహించారు. రెండు నెలలకు గానూ దేవస్థానానికి హుండీల ద్వారా రూ.6,81,853 నగదు, 140 గ్రాముల బంగారం, 2.25 కేజీల వెండి వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ పర్యవేక్షణ అధికారి పి.ఎస్.ఎన్.మూర్తి, పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు తవిటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల భవితకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీడీపీవో రమణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు

సీతమ్మధార: భావిభారత పౌరులకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలని ఐసీడీఎస్ విశాఖ అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీవో రమణకుమారి అన్నారు. నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషణ భీ పడాయి కార్యక్రమంలో మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మూడేళ్ల లోపు పిల్లలకు సంరక్షణ ఇస్తూ పోషకాహారాన్ని వారి తల్లులకు అందిస్తామన్నారు. 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలకు భాష, అంకెలు నేర్పిస్తామని చెప్పారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి ఏమేం చేయాలన్న అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్లు వరలక్ష్మి, వినీషాసుందరి, జీవీఎంసీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మజారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేట విరామ భృతి రూ.20 వేలు చెల్లించాలి



మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావుకు వినతి పత్రం అందజేస్తున్న చంద్రశేఖర్

మహారాణిపేట: మత్స్యకారులకు వేట విరామ సమయంలో రూ.20 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం తక్షణం హామీని నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు, మత్స్య మత్య కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు కర్రి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఫిషింగ్ హార్బర్‌లోని ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట మత్స్యకారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేట విరామ సమయంలో రూ.10 వేలు చొప్పున మత్స్యకార భృతిని ఇచ్చిందని తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు మత్స్యకార భృతి రూ.20 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే పది నెలలు అవుతున్నా మత్స్యకార భృతి చెల్లించకపోవడం శోచనీయమన్నారు. అలాగే డీజిల్‌పై సబ్సిడీ పెంచుతామని చెప్పిన హామీని అమలు చేయాలన్నారు. సబ్సిడీ లీటరుకు రూ.9 నుంచి రూ.20 పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే జెట్టీ ఫీజులు రద్దు చేయాలని, ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు మరమ్మతులకు స్థలం కేటాయించాలని కోరారు. సీఐటీయూ జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ మహిళా మత్స్యకారులకు కూడా జీవన భృతి ఇవ్వాలని కోరారు. అనంతరం మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చంద్రమౌళి, రామకృష్ణ గనగళ్ల ఎర్రికోడు, శ్రీనివాసు,కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గాజా మారణహోమం దారుణం

- పౌర ప్రజా సంఘాల వేదిక ప్రతినిధులు
- పాలస్తీనా ప్రజలకు మద్దతుగా నిలవాలని పిలుపు



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ ప్రతినిధి లక్ష్మి

సీతమ్మధార: అమెరికా సామ్రాజ్యవాదుల అండదండలతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను ఆపాలని పౌర ప్రజా సంఘాల వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వేదిక ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌర ప్రజాసంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు మాట్లాడారు. రెండేళ్లుగా ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యహు అంతర్జాతీయ యుద్ధ నియమాలు ఉల్లంఘించి గాజాలో మారణహోమాన్ని సృష్టిస్తున్నారన్నారు. యుద్ధాన్ని విరమించాలని ఐక్యరాజ్య సమితి చెబుతున్నా వినకుండా ఇజ్రాయిల్ దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న పౌర సమాజం పాలస్తీనా ప్రజలకు మద్దతుగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో పౌర ప్రజా సంఘాల ప్రతినిధులు మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి, మానవ హక్కుల వేదిక ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి వీఎస్ కృష్ణ , పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి, మహిళా చేతన జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి పద్మ, భారత నాస్తిక సమాజం ప్రతినిధులు కె.రామ్ ప్రభు, నూకరాజు, సీఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు కె.లలిత, ఏఐటీయూసీ ప్రతినిధులు ఎం.మన్మథరావు, ఎస్‌కే రెహమాన్ ఇస్కఫ్ ప్రతినిధి క్షేత్రపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ప్రపంచ రంగస్థల దినోత్సవం



సినీనటుడు ప్రసన్నకుమార్‌ను సన్మానిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు



తులసి తీర్థం నాటికలోని ఓ సన్నివేశం

విశాఖ విద్య: ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని ఆంధ్రా యూనివర్సిటీ థియేటర్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ ప్రాంగణంలోని కె.వి.గోపాలస్వామి థియేటర్‌లో తులసీ తీర్థం హాస్యనాటిక, అల్లూరి సీతారామరాజు బుర్రకథ ప్రదర్శించారు. వేడుకలకు హాజరైన సినీ నటుడు ప్రసన్నకుమార్‌ను ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావులు సన్మానించారు. థియేటర్ ఆర్ట్స్ విభాగం విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రంగస్థలాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. థియేటర్ ఆర్ట్స్ విభాగం అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని వీసీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, థియేటర్ ఆర్ట్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.భాస్కర్‌రావు, శశిభూషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.